క్లుప్తంగా

వ్యవసాయాధికారిగా శ్రీనివాస్ రాజు



పాపన్నపేట(మెదక్): మండల వ్యవసాయాధికారిగా పి.శ్రీనివాస్ రాజు నియామకమయ్యారు. ఇక్కడ డిప్యుటేషన్‌పై పనిచేసిన నాగమాధురి డీఏఓ కార్యాలయానికి వెళ్లారు. కాగా, ఖమ్మం జిల్లాలో పని చేసిన శ్రీనివాస్ రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్న తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరిన దేవులపల్లి బీఆర్ఎస్ నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని దేవులపల్లికి చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు సోమవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు గ్రామానికి చెందిన శ్రీను, దాసు, శంకరయ్య, రాములు తదితరులు పార్టీలో చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావ్, లచ్చయ్య, నర్సింహారెడ్డి, సత్యనారాయణ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని తుక్కాపూర్‌కి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు సోమవారం కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో మాజీ ఉప సర్పంచ్ నర్సింలు, అరవింద్, కార్యకర్తలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాధవి, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు రాములు, తదితరులు ఉన్నారు.

నార్సింగి ఏఓగా భరత్‌కుమార్



చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల వ్యవసాయశాఖ అధికారిగా భరత్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. సిద్దిపేట జిల్లాలో ఏఈఓగా విధులు నిర్వహిస్తున్న ఆయ న పదోన్నతిపై ఏఓగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన నార్సింగి వ్యవసాయశాఖ కార్యాలయంలో విధుల్లో చేరారు. గతంలో ఇక్కడ పనిచేసిన యాదగిరి డీఓ ఆఫీస్‌కు అటాచ్ అవ్వగా.. చేగుంట ఏఓ యాదగిరి అదనపు బాధ్యతలు నిర్వహించారు.

ఆయుర్వేద మందు పంపిణీకి విశేష స్పందన

నర్సాపూర్: తమ ఆశ్రమంలో సోమవారం చేపట్టిన ఉచిత ఆయుర్వేద మందు పంపిణీకి విశేష స్పందన లభించిందని స్థానిక సువి/జ్ఞాన ఆశ్రమం వ్యవస్థాకుడు ఆచార్య సత్యవీర్ తెలిపారు. పౌర్ణమిని పురస్కరించుకుని ఆస్తమా, దగ్గు తదితర వ్యాధులకు ఉచితంగా ఆయుర్వేద మందును పంపిణీ చేశామన్నారు. నర్సాపూర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు మందులు తీసుకెళ్లారని చెప్పారు.

ఘనంగా దుర్గామాత నిమజ్జన ఊరేగింపు



ఊరేగింపులో గ్రామస్తులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని లింగాపూర్‌లో దసరా నవరాత్రుల్లో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహ నిమజ్జన ఊరేగింపు ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా దుర్గామాత విగ్రహం ఎదుట గ్రామస్తులు భజన పాటలతో పాటు కోలాటం, నృత్యం చేశారు. ఈ మేరకు దుర్గామాత నామస్మరణంతో గ్రామ పరిసరాలు మార్మోగాయి.

తహసీల్దార్ కార్యాలయానికి బోర్డు ఏర్పాటు చేయాలి



తహసీల్దార్ కార్యాలయానికి బోర్డు లేని వైనం

మనోహరాబాద్(తూప్రాన్): నిత్యం ప్రజలతో కిటకిటలాడే తహసీల్దార్ కార్యాయానికి కనీసం బోర్డు కరువైంది. గత కొంతకాలంగా బోర్డు లేకుండానే అధికారులు కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే వారికి కనీస సౌకర్యాలు కూడా లేవని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కనీస వసతులు, కార్యాలయానికి బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బీసీ హాస్టల్ హుళక్కేనా!

శిథిలావస్థకు చేరుకున్న భవనం
- మూడేళ్లుగా మూసివేసిన వైనం
- పట్టించుకోని అధికారులు



బీసీ హాస్టల్‌లో విద్యార్థులు(ఫైల్)

రేగోడ్(మెదక్): గతంలో పేద విద్యార్థులకు వసతిని కల్పించి ఎంతోమందిని ఉన్నత శిఖరాలకు చేర్చిన బీసీ బాలుర హాస్టల్ శిథిలావస్థకు చేరుకుంది. విద్యార్థులతో పాటు భవనాన్ని పట్టించుకోవాల్సి ఉన్నా కనీసం స్పందించేవారు కరువయ్యారు. ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో ప్రస్తుతం హాస్టల్ మూతబడింది. దీంతో ఇక బీసీ హాస్టల్ లేనట్లేనా! అంటూ స్థానికుల్లో చర్చనీయాంశంగా మారింది. మెదక్ జిల్లా రేగోడ్ మండల కేంద్రంలో బీసీ బాలుర హాస్టల్‌ను ఏర్పాటు చేసి సుమారు మూడు దశాబ్దాలు గడిచింది. తొలుత వంద సీట్లతో అద్దె ఇంట్లో హాస్టల్ వసతిని కల్పించారు. ఆ తర్వాత నూతనంగా భవనం నిర్మించి అందులో వసతిని కల్పించారు. దీంతో అందోల్ నియోజకవర్గంతో పాటు నారాయణఖేడ్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాల నుంచి పేద విద్యార్థులు ఇక్కడే వసతి పొంది విద్యాభ్యాసం కొనసాగించారు. ఆనాడు విద్యార్థులతో కిటకిటలాడిన బీసీ హాస్టల్ నేడు శిథిలావస్థకు చేరుకొని వెలవెలబోతోంది. గత కొంతకాలంగా బీసీ హాస్టల్‌కు నూతన భవనం నిర్మించాలని ప్రభుత్వాలను కోరుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. భవనం శిథిలావస్థకు చేరడం.. వసతులు సరిగా లేకపోవడంతో పాటు విద్యార్థులు లేక గత మూడేళ్లుగా హాస్టల్ మూతబడింది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మూతబడిన హాస్టల్

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి



బ్యాంకు శాఖను ప్రారంభిస్తున్న ఇండియన్ బ్యాంక్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ ప్రనీష్‌కుమార్

నర్సాపూర్: బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ బ్యాంకు ఫీల్డ్ జనరల్ మేనేజర్ ప్రనీష్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక బీవీఆర్ఐటీ ఆవరణలో ఇండియన్ బ్యాంకు శాఖను విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ విష్ణురాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేజీ ఆవరణలో తమ బ్యాంకు శాఖతో పాటు ఏటీఎంను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బ్యాంకు సేవలను అన్ని వర్గాల ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సొసైటీ చైర్మన్ విష్ణురాజు మాట్లాడుతూ కాలేజీ ఆవరణలో బ్యాంకును ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. బ్యాంకు జోనల్ మేనేజర్ పీఎస్ఎస్ సుధాకర్‌రావు మాట్లాడుతూ నర్సాపూర్ పట్టణ ప్రజలతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలు తమ బ్యాంకులో సేవలు పొంద వచ్చన్నారు. వ్యవసాయం, బంగారు నగలపై రుణాలు, గృహాలకు రుణాలు ఇస్తామని వివరించారు. కార్యక్రమంలో స్థానిక బ్యాంకు మేనేజర్ వినయ్‌స్వరూప్, సొసైటీ వైస్ చైర్మన్ రాజగోపాల్, కాలేజీ ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, డైరెక్టర్ లక్ష్మీ ప్రసాద్, ఇతర ప్రతినిధులు కృష్ణమోహన్, కాంతారావు, బాపిరాజు, సురేష్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం



మణికంఠ

తూప్రాన్: దసరా సెలవులకు ఇంటికి వచ్చిన కుమారుడు కనిపించడంలేదని బాధితుడి తండ్రి కృష్ణ సోమవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ శివానందం తెలిపారు. వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన బిజిలిపురం కృష్ణ పెద్ద కుమారుడు మణికంఠ(15) సిద్దిపేట జిల్లాలోని వర్గల్ మండలంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అయితే ఇటీవల దసరా పండుగ సెలవుల నిమిత్తం ఇంటికి వచ్చిన మణికంఠ సోమవారం తెల్లవారుజామున నుంచి కనిపించడంలేదన్నారు. ఈ మేరకు బంధువులు, స్నేహితులను అడిగినా ఆచూకీ లభ్యం కాలేదు. బాధిత తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులు



ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

ఎంఈఓ సత్యనారాయణ

తూప్రాన్: ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులను సోమవారం ఎంఈఓ సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రైవేటు పాఠశాలకు దీటుగా యూకేజీ తరగతులను ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ తరగతుల్లో నాలుగేళ్లు దాటిన విద్యార్థులను చేర్చుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు ప్రాథమిక పాఠశాలలో యూకేజీ విద్యను అభ్యసించడానికి 9 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందారన్నారు. యూకేజీ చదువుకునే విద్యార్థులను పాఠశాలలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పట్లూరి లక్ష్మణ్, ప్రీ ప్రైమరీ టీచర్ రేఖ, సీఆర్పీ కన్యాలాల్ పాల్గొన్నారు.

విద్యా సరస్వతిని దర్శించుకున్న సునీతారెడ్డి



మనవడి అన్నప్రాసనలో సునీతారెడ్డి

వర్గల్(గజ్వేల్): వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రాన్ని సోమవారం మాజీ మంత్రి సునీతారెడ్డి సందర్శించారు. కుమారుడు శశిధర్‌రెడ్డి-రుత్వికరెడ్డి దంపతులు, మనవడు నిష్వికారెడ్డితో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. మనవడు నిష్వికారెడ్డికి అమ్మవారి సన్నిధిలో శాస్త్రోక్తంగా అన్నప్రాసన జరిపించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

'బేటీబచావో..బేటీపడావో'పై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

నారాయణఖేడ్: మహిళా శిశుసంక్షేమశాఖ, మహిళా సాధికారిత కేంద్రం సంయుక్తంగా పట్టణంలోని నియోప్రగతి ఉన్నతపాఠశాలలో సోమవారం విద్యార్థులకు బేటీబచావో.. బేటీపడావో పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా సాధికారిత కేంద్రం జిల్లా ఫైనాన్షియల్ స్పెషలిస్టు నర్సింహులు బాలికల హక్కులు, రక్షణ, పోక్సోచట్టం, లింగ సమానత్వం, లింగ సాధికారిత, బాల్య వివాహాల నిర్మూలనలో మన వంతు పాత్ర, టోల్ ఫ్రీ నంబర్లు 1098, 181ల గురించి సమగ్రంగా అవగాహన కల్పించారు. పాఠశాల కరస్పాండెంట్ వెంకటరత్నం, ప్రిన్సిపాల్ ప్రకాశ్ బాలబాలికల సామాజిక బాధ్యత, సమాన విద్య, సామాజిక మాధ్యమాల వల్ల జరిగే అనర్థాలను గురించి వివరించారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్‌రూరల్: అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పరామర్శించారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీ(లక్ష్మాపూర్) మాజీ సర్పంచ్ కొలిచెల్మె స్వామి తండ్రి మల్లయ్య కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న యాదవరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, కొండపాక మాజీ ఎంపీపీ ర్యాగల దుర్గయ్య సోమవారం మాజీ సర్పంచ్ స్వామిని పరామర్శించారు. కార్యక్రమంలో రమేశ్‌గౌడ్, నిమ్మ రమేశ్, ప్రవీణ్, నిజామొద్దిన్ తదితరులున్నారు.

భూబాధిత కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలి



రైతులతో మాట్లాడుతున్న రాంచందర్

జహీరాబాద్ టౌన్: పరిశ్రమల కోసం భూముల్చిన రైతుల కుటుంబ సభ్యులకు స్థానిక కర్మాగారాల్లో ఉద్యోగాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రాంచందర్ డిమాండ్ చేశారు. సోమవారం బూచినెల్లి గ్రామ రైతులతో సమావేశమయ్యారు. మాయమాటలు చెప్పి రైతుల నుంచి విలువైన భూములు తీసుకుని ప్రభుత్వం వారిని మోసం చేస్తోందని ఆరోపించారు. భూబాధిత కుటుంబాలకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి పక్కరాష్ట్రాల వారిని కంపెనీలో చేర్చుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం జరగాలంటే రైతులు సీపీఎంకు అండగా ఉండాలని, స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు విఠల్, రహీం, గోవర్ధన్, గుండప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కరువు

హుస్నాబాద్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని లంబాడీ హక్కుల పోరా ట సమితి జిల్లా అధ్యక్షుడు మాలోతు సత్యం నాయక్ వాపోయారు. పట్టణంలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల ఎదుట వర్కర్లు చేస్తున్న నిరవధిక సమ్మెకు సోమవారం ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్లతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని, వర్కర్లకు టైం స్కేల్ ప్రకారం జీతభత్యాలు ఇవ్వాలని కోరారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ట్రాఫిక్ అవుట్‌పోస్ట్ ప్రారంభం



ట్రాఫిక్ అవుట్‌పోస్టును ప్రారంభిస్తున్న గజారావు భూపాల్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌లోని పాత మున్సిపల్ భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ అవుట్ పోస్టును సోమవారం సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డా.గజారావు భూపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకొని నూతనంగా తెల్లాపూర్ పరిధిలో ట్రాఫిక్ అవుట్‌పోస్టును ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా అప్పలనాయుడు బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్, ట్రాఫిక్ అదనపు డిప్యూటీ కమిషనర్ వీరన్న, ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య, మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్, కొల్లూర్ ఇన్‌స్పెక్టర్ గణేశ్ పటేల్, రామచంద్రాపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

పల్లెప్రకృతి వనంలో చెట్లు నరికివేత



బద్రాతండా పల్లెప్రకృతి వనంలో నరికిన చెట్లు

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాల ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందించాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేయడంతో పాటు రూ.లక్షల్లో ఖర్చు చేసి మొక్కలను నాటింది. గతంలో నాటిన మొక్కలు ప్రస్తుతం ఏపుగా పెరిగాయి. అయితే మండల పరిధిలోని బద్రాతండా పంచాయతీ పరిధిలోని పల్లె ప్రకృతి వనంలో ఏపుగా పెరిగిన చెట్లను పంచాయతీ కార్యదర్శి మోహన్ నరికి వేయించాడు. పల్లె ప్రకృతి వనంలో చెట్లను నరికి వేయడం ఎంత వరకు సమంజసమని తండావాసులు ప్రశ్నించారు. ఈ విషయమై కార్యదర్శిని వివరణ కోరగా.. పాములు వస్తున్నాయని కొంతమంది ఫిర్యాదు చేయడంతో చెట్లను నరికి వేయించామన్నారు. పాములు వస్తే ప్రకృతివనంలో పొదలు తొలగించాలే తప్పా చెట్లను నరికివేయడం సరికాదని మరి కొంతమంది ఆరోపిస్తున్నారు.

గాంధీ విగ్రహం ధ్వంసం హేయమైన చర్య

కాంగ్రెస్ నేత రాజిరెడ్డి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత రాజిరెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): మహాత్మగాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్య కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజిరెడ్డి అన్నారు. శ్రీలంక పర్యటన అనంతరం మాసాయిపేటకు వచ్చిన రాజిరెడ్డిని నియోజకవర్గ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్ 2న మండలంలోని యశ్వంతరావ్‌పేటలో బీజేపీ నాయకులు గాంధీ విగ్రహాన్ని పూర్తిగా ధ్వంసం చేయడం దారుణమన్నారు. భవిష్యత్తులో గాంధీ ఆనవాళ్లు లేకుండా చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందన్నారు. ఈ విషయంలో నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెత్త ఎత్తున ర్యాలీ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాగిరెడ్డి, మహేశ్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, సిద్దిరాములుగౌడ్, సుధాకర్‌గౌడ్, మల్లేశం, నర్సింలు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నీళ్ల కోసం ఇంటికో డ్రమ్ము

- మంజీర నీటి ప్రవాహంలో లీకేజీ
- నీటి సరఫరాకు అంతరాయం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



నీళ్ల కోసం ఏర్పాటు చేసిన డ్రమ్ములు

నర్సాపూర్: నీళ్ల కోసం నర్సాపూర్ ప్రజలు ఇంటికో డ్రమ్ము ఏర్పాటు చేసుకున్నారు. మిషన్ భగీరథ పథకం పైపులైన్‌కు వెండికోల్ వద్ద మంజీర నీటి ప్రవాహంలో లీకేజీ ఏర్పడడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ లీకేజీ కారణంగా కొంతకాలంగా నల్లాల ద్వారా నీళ్లు రావడం లేదు. దీంతో స్థానిక మున్సిపాలిటీలోని పలు వార్డులలో నీటి సమస్య తలెత్తింది. ఈ సమస్యను అధిగమించేదుకు మున్సిపాలిటీ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. అయితే నీటిని తమ ఇంటి అవసరాల కోసం ఉపయోగించుకునేందుకు కొంతమంది తమ ఇళ్ల ఎదుట డ్రమ్ములు ఏర్పాటు చేసుకున్నారు. ట్యాంకర్ రాగానే తమ డ్రమ్ముల్లో నీటిని నింపి అవసరాలు తీర్చుకుంటున్నారు. కాగా, ట్యాంకర్లు ఎప్పుడు వస్తాయో తెలియడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షాలకు అలుగు పారుతున్న చెరువులు



ఉధృతంగా ప్రవహిస్తున్న ఉత్తులూర్ వాగు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 69.4 ఎంఎంల భారీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ వర్షాలకు ఆయా గ్రామాల్లో చెరువులు, వాగుల్లో భారీగా వరదనీరు ప్రవహిస్తోంది. ఈ వర్షాలకు రైతులు ఆందోళన చెందుతున్నారు.

భారీ వర్షం

రేగోడ్(మెదక్): మండలంలో శనివారం రాత్రి నుంచి తెల్లవారుజామున వరకు భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి చెరువులు పొంగి అలుగులపై ఉధృతంగా వరద పారుతోంది. దీంతో కొండాపూర్-జగిర్యాల, రేగోడ్-మర్పల్లి, రేగోడ్-చౌదర్‌పల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే పలు ప్రాంతాల్లో పంటలు నీట మునగగా.. పురాతన ఇళ్లు దెబ్బతిన్నాయి. ఈ సందర్భంగా ఆర్ఐ ఫెరోజ్ మాట్లాడుతూ మండలంలో 9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని తెలిపారు. వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

విజేతలకు బహుమతుల అందజేత



బహుమతులు అందజేస్తున్న ఓయూ జేఏసీ నాయకుడు మోహన్‌నాయక్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని కామారంతండాలో కేపీఎల్ క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించారు. సోమవారం ఎస్ఎస్ బ్రదర్స్, బంజార బుల్స్ మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బంజారబుల్స్ క్రికెట్ జట్టు విజేతగా గెలిచింది. ఈ పోటీల్లో గెలుపొందిన జట్టుకు ఓయూ జేఏసీ నాయకుడు మోహన్‌నాయక్ చేతులమీదుగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కేపీఎల్ ఆర్గనైజర్స్ నరేష్, మోహన్, భానుప్రసాద్, సంతోష్, నాయకులు గణేష్, రవిచంద్, విఠల్, భాస్కర్, దేవ్లా, చంటి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి



అధికారిణికి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

జహీరాబాద్ టౌన్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కాంట్రాక్టర్ కార్మికులు సోమవారం మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ.. రెండు నెలల నుంచి మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదన్నారు. కార్మికులు దసరా పండగ పూట పస్తులు ఉండాల్సిన పరిస్థితి వచ్చిందని మండిడ్డారు. వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో యూనియన్ నాయకులు సంజీవ్, రాకేశ్, మోహన్ ఉన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రావు

పత్నూర(సంగారెడ్డి): సాక్షి దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన ।పరిహారం పరిహాసమేనా..! కథనంపై వ్యవసాయ శాఖ అధికారుల్లో కదలిక వచ్చింది. సోమవారం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి ప్రాథమిక అంచనా వేశారు. మంజీరా నది నీటి ఉధృతి ప్రభావంతో హత్నూర మండలంలోని బోరపట్ల, రెడ్డిఖానాపూర్, కాసాల, హత్నూర, నవాబుపేట, పన్యాల, బడంపేట్, కొన్యాలా, చీక్‌మద్దూర్, లింగాపూర్, సిరిపుర గ్రామ శివారుల గుండా మంజీరా నది నీటి ప్రవాహానికి పత్తి, వరి పంటలు నీట మునిగాయి. హత్నూర మండలంలో మంజీరా నీటి ప్రభావం వల్ల 1082 రైతులకు సంబంధించి వరి పంట సుమారు 1604 ఎకరాలు, పత్తికి సంబంధించి, 912 మంది రైతులకు చెందిన 1156 ఎకరాల్లో నీట మునిగి నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. మంజీరా నది నీటి ప్రవాహంతో నష్టపోయిన పంటల సమాచారాన్ని ప్రాథమికగా అంచనా వేసి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు చెప్పారు.